ఈనాడు ఆదివారం

Sunday , November 23, 2008




- ఈ వారం ప్రత్యేకం
- 'మాయ'లోకం
- కథ
- బాలవినోదిని
- కార్టూన్స్
- ఖజానా
- పుస్తక సమీక్ష
- భాష / సాహిత్యం
- సచిత్ర కథనాలు


# స్వేచ్ఛగా తెలుగు సాఫ్ట్‌వేర్!




'సాఫ్ట్‌వేర్ స్వాతంత్ర్యం మన జన్మహక్కు' అని నినదిస్తూ మొదలైందే ఉచిత సాఫ్ట్‌వేర్ ఉద్యమం. మనదగ్గరా అది వూపందుకుంది. ఆ ఫలితమే 'స్వేచ్ఛ'.



'సాఫ్ట్‌వేర్ డబ్బుకు సంబంధించిన వ్యవహారం కాదు. స్వేచ్ఛతో ముడిపడిన సమస్య.
వాక్ స్వాతంత్ర్యంలా...
భావప్రకటన స్వాతంత్ర్యంలా...
సాఫ్ట్‌వేర్ స్వాతంత్ర్యమూ ఉండాలి.
ఎవరికి అవసరమైన సాఫ్ట్‌వేర్ వాళ్లకు అందుబాటులో ఉండాలి. దర్జాగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉండాలి'

ఏడేళ్ల క్రితం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఉచిత సాఫ్ట్‌వేర్ ఉద్యమకర్త రిచర్డ్ స్టాల్‌మెన్ అన్న మాటలివి. కిరణ్‌చంద్రను అవెంత ప్రభావితం చేశాయంటే... అతను 'ఏదో ఒకటి చేసితీరాల్సిందే' అని ఆ క్షణమే నిర్ణయించుకున్నాడు. మిత్రులతో తన ఆలోచన చెప్పాడు. 'మేం రెడీ బాస్' అంటూ బాసటగా నిలిచారు భువన్‌కృష్ణ, రాజు, నవీన్, హేమ, ప్రత్యూష్ అండ్ కో.

టెక్నాలజీ జనంలోకి వెళ్లాలంటే వాడుకభాషే మార్గం. 'తెలుగులో ఉచిత సాఫ్ట్‌వేర్' తీసుకురావాలన్నది వాళ్ల లక్ష్యం. ఆ ప్రయత్నం ఇంగ్లిష్ వచ్చిన తెలుగువారి కోసం కాదు. తెలుగొక్కటే తెలిసిన గ్రామీణుల కోసం.

ఇ-ప్రపంచంలో కాలుపెట్టాలంటే, ఇంగ్లిష్



వచ్చితీరాల్సిందేనా. తెలుగు భాషకేం తక్కువ? నిజానికి, తెలుగులో ఓ మంచి సాఫ్ట్‌వేర్ అవసరం ఉంది. ఉచిత సాఫ్ట్‌వేర్ అవసరం ఇంకా ఉంది.



2002లో ఫాంట్స్ తయారీ మొదలైంది. జపనీస్ లిపి చాలా క్లిష్టంగా ఉంటుందంటారు. తెలుగు రెండాకులు ఎక్కువే. కొన్ని పదాలైతే కూచిపూడి భంగిమల్లా ఉంటాయి. దానికితోడు ఫాంట్స్ తయారీకి వాడే సాఫ్ట్‌వేర్ ఎక్కడా ఉచితంగా దొరికేది కాదు. ఆపరేటింగ్ సిస్టమ్ కోసం తెలుగు పదాల్ని ఎంచుకోవడం ఇంకో సమస్య. ఏ భాష వాడాలి? పండితులు రాసే భాషా, పామరులు మాట్లాడే భాషా. మధ్యస్థంగా పత్రికల్లో వచ్చే శిష్టవ్యవహారికమా? అందరూ ఏకగ్రీవంతా జనం భాషకు ఓటేశారు. ఇంకేముంది, ఫైళ్లన్నీ దస్త్రాలయ్యాయి! అలా.. దాదాపు పదమూడు వందల పదాలకు తెలుగు సమానార్థాలు వెదుక్కున్నారు. అవసరమైన చోట పాత్రికేయుల సాయం తీసుకున్నారు. సదస్సులు జరిపి చర్చకు పెట్టారు. ఆనోటా ఈనోటాపడి విషయం ఇంజినీరింగ్ క్యాంపస్‌ల దాకా వెళ్లింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకూ తెలిసింది. 'మేమూ భాగస్వాములం అవుతాం' అని ముందుకొచ్చారు. ఒకరూ ఇద్దరూ కాదు... వందల మంది! ఫాంట్స్ చేయడానికే రెండేళ్లు పట్టింది. మిగతా పనులన్నీ చకచకా జరిగిపోయాయి.

2004లో 'స్వేచ్ఛ' సాఫ్ట్‌వేర్ విడుదలైంది. అదింకా ప్రాథమిక దశే. అయితేనేం, తెలుగులో ఇ-మెయిల్స్ పంపుకోవచ్చు. తెలుగులో 'ఛాట్' చేసుకోవచ్చు. తెలుగులోనే 'పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు' ఇచ్చుకోవచ్చు! తెలుగొక్కటే వచ్చినవారికి ఇక ఏ బాధా ఉండదు. ...అలా తెలుగు సాఫ్ట్‌వేర్‌కు 'స్వేచ్ఛ' వచ్చేసింది. www.swecha.orgనుంచి ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎవరికీ కప్పం కట్టాల్సిన పనిలేదు. ఎవరి సార్వభౌమత్వమూ ఉండదు. అది అందరి ఆస్తి. 128 మెగా బైట్స్ ర్యామ్, 1 జీబీ స్పేస్ ఉంటే చాలు. అయినా, ఆ సాఫ్ట్‌వేర్ పరిపూర్ణం కాదు. లోపాల్ని సవరించుకుని, పరిమితుల్ని అధిగమించి ఈ సంక్రాంతికి కొత్తల్లుడిలా... కొత్త 'స్వేచ్ఛ' రాబోతోంది. కిరణ్ బృందం ఆపనిమీదే ఉంది.

### విద్యార్థుల కోసం...

రెండో ప్రయోగం...ఇ-స్వేచ్ఛ. ఇది ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం. చదువుకునే పిల్లలు డబ్బులు పెట్టి చదువుల సాఫ్ట్‌వేర్లేం కొంటారు పాపం! అందుకే 'స్వేచ్ఛ' ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం, ఇంజినీరింగ్ విద్యార్థుల చేత, ఇంజినీరింగ్ విద్యార్థుల సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయించింది. ఇది తెలుగుతోపాటు ఇంగ్లిష్‌లోనూ ఉంటుంది.

తెలుగులోనే ఆఫీసు పనుల్ని చక్కబెట్టుకోడానికి 'ఓపెన్ ఆఫీసు'ను కూడా అందుబాటులోకి తెచ్చింది. 'ఫైర్‌ఫాక్స్' తెలుగీకరణా పూర్తయింది. ఇవన్నీ ఒక ఎత్తు. 'తెలుగు చదివి వినిపించే' సాఫ్ట్‌వేర్ ఇంకో ఎత్తు. నిరక్షరాస్యులు టెక్నాలజీని ఉపయోగించుకునే మహత్తర ప్రయత్నమిది. అక్షరం రానివాళ్లు కూడా తెలుగు పత్రికలు చదువుకోవచ్చు, కాదుకాదు వినొచ్చు. పంటల సమాచారం తెలుసుకోవచ్చు. అంతా అనుకున్నట్టే జరిగితే ఇంకో ఏడాదిలో ఆ పని పూర్తవుతుంది. 'స్వేచ్ఛ' బృందానికి ఇంకా చాలా ఆలోచనలున్నాయి. కాపీరైట్‌తో సంబంధం లేని గ్రంథాల్ని, బాల సాహిత్యాన్ని, జానపదాల్ని,

కళల్ని ఇంటర్నెట్‌లో ఉంచాలనుకుంటోంది.

### మీకూ 'స్వేచ్ఛ'...

'స్వేచ్ఛ అందరి ఉద్యమం. ఆసక్తి ఉన్న ఎవరైనా మాతో కలిసి పనిచేయొచ్చు. మీ వృత్తి ఉద్యోగాలు, మీ వ్యాపకాలు మీకుంటాయి. వాటిమధ్యే మాకోసమూ కాస్త సమయం కేటాయించండి' అంటున్నారు కిరణ్. మనసుంటే చాలా మార్గాలున్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో సహకరించొచ్చు. సాహిత్యాన్ని సేకరించి పంపొచ్చు. కంపోజింగ్ పనులు చేసిపెట్టొచ్చు. ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకోవచ్చు. అవేవీ కుదరవను కుంటే, 'స్వేచ్ఛ' సాఫ్ట్‌వేర్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకున్నా చాలు. వాడకాన్ని మించిన సహకారం ఏముంటుంది. ఉద్యమానికి వూతమిచ్చినట్టే.

PREVIOUS NEXT

| | | |
|---|---|---|
| Your Mail Id : | | |
| Mail This Link To email id : | | Send Link |